క్లుప్తంగా

తొలి రోజే 62.61 శాతం పింఛన్ల పంపిణీ



మహిమలూరులో మేకల ఓబులమ్మకు ఇంటి వద్దనే వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీరు మస్తానయ్య

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్లు మంగళవారం 62.61 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 4,873 మంది లబ్ధిదారులు ఉండగా 3,048 మందికి రూ.84.46 లక్షల పింఛన్ నగదు వలంటీర్లు తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. మర్రిపాడు మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 71 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

జలదంకి: మండలంలోని కమ్మవారిపాళెం సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మవారిపాళెం సర్పంచ్ తమ్మినేని సతీష్‌బాబు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వలంటీర్ల ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయాల్లో పలు వార్డుల్లో ఖాళీగా ఉన్న 9 వలంటీరు పోస్టుల భర్తీకి నియామకం చేపట్టినట్లు కమిషనర్ బి నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి, అర్హులైన వారు 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

రెండు సొసైటీలకు నూతన చైర్మన్ల నియామకం



బొమ్మిరెడ్డి రవి కుమార్ రెడ్డి, బట్టేపాడు సొసైటీ చైర్మన్



సానా వేణుగోపాల్ రెడ్డి, ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని బట్టేపాడు, ఆత్మకూరు వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన చైర్మన్లను నియమిస్తూ మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. త్రిసభ్య కమిటీలతో కూడిన రైతు నాయకులను ఈ పదవుల్లో నియమించారు. బట్టేపాడు సొసైటీ చైర్మన్‌గా బట్టేపాడుకు చెందిన బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సభ్యులుగా కేతా చిన్న వెంకట సుబ్బారెడ్డి, బొమ్మిరెడ్డి గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్‌గా రామస్వామిపల్లికి చెందిన సానా వేణుగోపాల్‌రెడ్డి, సభ్యులుగా మునుమూరి కామాక్షిరెడ్డి, చల్లా కృష్ణారెడ్డిలను నియమించారు. త్వరలోనే పదవీ బాధ్యతలు స్వీకరిస్తామని తెలిపారు.

వైభవంగా అలఘునాథుని కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: శ్రవణ నక్షత్రం పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి అలంకరించారు. కల్యాణం పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు రామయ్యస్వామి, శ్రీనివాస శర్మ దేవదేవేరుల కల్యాణ ఘట్టాలను వివరిస్తూ కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చేజర్ల తహసీల్దార్‌గా విజయ్

చేజర్ల: చేజర్ల డీటీగా పనిచేస్తున్న విజయ్ తహసీల్దార్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండలంలో జరిగే రీ సర్వే పారదర్శకంగా జరిగే విధంగా చూస్తానని తెలిపారు.

సేవా సైన్యం.. సంకల్పం

మంచానికే పరిమితమైన, దూరాభారం నడవలేని వృద్ధులు, దివ్యాంగులు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అనారోగ్య బాధితులు. కూలికి వెళ్తే కానీ పూట గడవని అభాగ్యులు. వీరందరికి ఇంటి పట్టునే మంగళవారం వేకువజాము నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన సేవా సైన్యం పింఛన్ల పంపిణీ చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే ఇంటి నుంచి దూరంగా ఉండే పంచాయతీ కార్యాలయానికో.. పాఠశాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన దయనీయ స్థితి. ఇలాంటి వారికి ఏ కష్టం లేకుండా ఠంఛన్‌గా 1వ తేదీనే పింఛన్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి వలంటీర్లు అదే సంకల్పం, అదే స్ఫూర్తితో అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కలిగిరిలోని పాతూరులో దివ్యాంగురాలు నిశ్శంకర తులసికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ అనుష



మంచానికే పరిమితమైన సంగం తిరుమనతిప్ప గిరిజన కాలనీకి చెందిన కలికిరి చెంచమ్మకు ఆమె ఇంటి వద్దనే పింఛను అందజేస్తున్న వలంటీర్ శాఖవరపు శ్రీనివాసులు



కలిగిరి పంచాయతీ పాపనముసిలిపాళెంలో ఉదయం 4 గంటలకు కేశంరెడ్డి వెంకటస్వామిరెడ్డికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గణేశం దొరసానమ్మ



అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లికి చెందిన వృద్ధురాలు షేక్ మహబూబికి ఇంటి వద్దనే ఉదయాన్నే మంచం మీద ఉండగానే పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ షేక్ హబీబున్నీషా



కావలి పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీకి చెందిన కిడ్నీ వ్యాధి బాధితురాలు నాగులూరి తిరుపతమ్మ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తాతా ప్రవీణ్



దుత్తలూరుకు చెందిన వృద్ధురాలు మంచం మీద నుంచి కదల్లేని చింతనబోయిన సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు మేడపు గిరీష్‌కుమార్



మంచంలో ఉన్న మర్రిపాడు మండలం డీసీపల్లికి చెందిన సుబ్బారెడ్డికి వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు కండె రాజశేఖర్



అల్లూరులోని కోనేటి సెంటర్‌కు చెందిన వృద్ధురాలు మరియమ్మకు ఉదయాన్నే ఆమె ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ సరిత

అందరి సహకారంతో ఆత్మకూరు అభివృద్ధి



ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఎంపీపీ తుమాటి విజయభాస్కర్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి
- అట్టహాసంగా ఎంపీపీ తూమాటి ప్రమాణ స్వీకారోత్సవం

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధ చేశామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని తెలిపారు. చేజర్ల నూతన ఎంపీపీగా తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ముందు చేజర్ల బస్టాండ్ సెంటర్ నుంచి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఎంపీపీ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులను పార్టీ కార్యకర్తలు, నాయకులు బాణసంచా, డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ చేజర్ల ఎంపీపీగా ఎన్నికైన తూమాటి విజయభాస్కర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనలతు, నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. ఏడాది కాలంలో 69 సచివాలయాల పరిధిలో 100కి పైగా పంచాయతీల్లో ఇంటింటి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకునే భాగ్యం కలిగిందన్నారు. అదే సమయంలో ప్రజలకు ఏం అవసరాలు ఉన్నాయి.. గ్రామానికి చేయాల్సి అభివృద్ధి పనులు తెలుసుకుని మేలు చేకూరేలా చేసే అవకాశం లభించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో ప్రత్యక్షంగా లబ్ధిదారులు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులన్నింటిని జాబితాగా రూపొందించుకుని ప్రతి పనిని పూర్తి చేసుకొంటూ పోతున్నానన్నారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు 'ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం' ద్వారా అందరిని ఒక తాటిపైకి తెచ్చి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. చేజర్ల సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పి రామమనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపీపీ వి తిరుపతినాయుడు, సొసైటీ అధ్యక్షుడు బి వీరరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సిద్ధల నాయుడు,బి మాలకొండారెడ్డి, జయంతుల్ నాయుడు, పూనూరు మాలకొండా రెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ జి వెంకటసుబ్బయ్య, ఆనంద్‌రెడ్డి, సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి డి నరసింహారెడ్డి, వార్డెన్ వెంకటరమణమ్మ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు



బాలాయపల్లి పంచాయతీ అంకిరెడ్డిపల్లిలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందిస్తున్న మేకపాటి రాజారెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజారెడ్డి

సీతారామపురం: దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయ, పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇంటి ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాలాయపల్లి సచివాలయ పరిధిలోని బాలాయపల్లి, అంకిరెడ్డిపల్లి, రంగనాయుడుపల్లి, పోకలవారిపల్లి గ్రామాల్లో రాజారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందిన వారికి బుక్‌లెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వెల్లివిరుస్తోందని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం జేజేలు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అవినీతి లేకుండా జనరంజక పాలన అందిస్తుండడంతో పేదలు చిరునవ్వుతో సంక్షేమ పథకాలు పొందుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లంచాలు, వివక్షకు తావులేకుండా కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారన్నారు. జగనన్న మేనిఫెస్టోలోని ప్రతి హామీ నెరవేర్చి ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోయారన్నారు. నాలుగు తరాలు గుర్తుపెట్టుకునే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తుంటే 14 సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఎన్ని రకాల మోసాలు చేశాడో ప్రజలు గమనించారన్నారు. 2024లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, బాలాయపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బసిరెడ్డి రమాదేవి, ఉపసర్పంచ్ కర్రా ప్రకాశం, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు అక్కి భాస్కర్‌రెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి, అంకినపల్లి నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను నిరసిస్తూ శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అల్లూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండలంలోని పాస్టర్స్ ఫెలోషిప్, యేసు అభిషేక మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతియుత ర్యాలీని నిర్వహించారు. స్థానిక గోడౌన్ల నుంచి చవటపాళెంలోని యేసు అభిషేక మినిస్ట్రీస్ చర్చి వరకు భారీ సంఖ్యలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీని నిర్వహించారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరకొండ శ్యాముయేల్ బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులను దారుణంగా కొట్టి చంపడం, మహిళలను వివస్త్రలుగా చేసి అత్యాచారం చేయడం దారుణమన్నారు. సమాజం సిగ్గుతో తలదించుకునేలా ప్రవర్తించిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ పరిస్థితులు చక్కబడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. తహసీల్దార్ కె చంద్రశేకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ కార్మికులు, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ సంయుక్తంగా మంగళవారం నిరసన ప్రదర్శన అనంతరం కమిషనర్ బి.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా 1వ తేదీన కార్మికుల జీతాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్స్ జీతంతో కలిపి ఇవ్వాలని, జీతం అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులు అందరిని రెగ్యులర్ చేయాలని, కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫాం, సబ్బులు, చమురు తదితర వస్తువులను సమయం ప్రకారం ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు శివప్రసాద్, హజరత్తయ్య, ఎ నాగయ్య, డేవిడ్‌రాజు, గురవయ్య, తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న డీఈ రంగవరప్రసాద్

అల్లూరు: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కావలి హౌసింగ్ డీఈ రంగవరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక లేఅవుట్‌లో లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ లేఅవుట్‌లో మొత్తం 415 ఇంటి స్థలాలకు 343 మందికి ఇళ్ల నిర్మాణానికి అనమతి వచ్చిందన్నారు. ఇంటి పట్టాలు పొందిన వారు నిర్మాణాలను ప్రారంభించాలని అవగాహన కల్పించారు. పనులు ప్రారంభించిన వెంటనే బిల్లులను కూడా పెట్టి ప్రభుత్వం నుంచి వచ్చే నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ కిరణ్, నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్ , మేడా కృష్ణారెడ్డి, చెంతాటి కరుణాకర్, బత్తల సుధ, పరిశినేటి రాజేష్, మునిరాజ్, షేక్ రసూల్, షేక్ జంషీర్, చెంతాటి శ్రీను, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మాధవ్, ఉమా పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

అల్లూరు : మూడు గడ్డివాములు దగ్ధమైన ఘటన స్థానిక నగర పంచాయతీ పరిధిలోని చింతగుంట కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎటగిరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి సంబంధించి 30 ఎకరాలకు చెందిన మూడు గడ్డివాములు ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

వైభవంగా గంధమహోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముజావర్లు

ఆత్మకూరు: ఆత్మకూరులోని సుల్తాన్ షాహీద్ దర్గాలో గంధమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్ద నుంచి నూతన పాత్రలో గంధాన్ని కలిపిన ముజావర్లు ఒంటె వాహనంపై దర్గా వద్దకు అంగరంగ వైభవంగా పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తూ దర్గా వద్దకు చేరుకున్నారు. ఫకీరుల జరబులతో, మంగళవాయిద్యాలు, డీజే, తీన్‌మార్ పరికరాల హోరెత్తుతుండగా, యువకులు నృత్యాలు చేశారు. బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా సాగారు. సత్రం సెంటర్, మెయిన్ బజార్, బీఎస్సార్ సెంటర్ మీదుగా గంధమహోత్సవం దర్గాకు వద్ద చేరుకుంది. ముజావర్లు దర్గాలో సుల్తాన్ షాహీద్ వారి సమాధిపై నూతన గలేఫులు పరిచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధాన్ని సమాధికి లేపనం చేసిన అనంతరం భక్తులకు అర్ధరాత్రి సమయంలో ప్రసాదం పంచి పెట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సంగం ఎంపీడీఓ గోపి, ఎంఈఓ జానకీరాం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని నాణ్యతను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. ఆ మేరకు భోజనం అందించే విధంగా చూడాలన్నారు.

బదిలీ కమిషనర్‌కు ఘన సన్మానం



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవల దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన ఎం.రమేష్‌బాబును శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన్ను కమిషనర్ బి నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కె చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, మున్సిపల్ ఆర్‌ఐ, ఖాసీం తదితరులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

సచివాలయంలో ఆర్డీఓ తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి

సంగం: సంగం సచివాలయాన్ని మంగళవారం ఆత్మకూరు ఆర్డీఓ ఎస్.కరుణకుమారి తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై కొంత అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని సూచించారు. సిబ్బంది పని తీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. అనంతరం బీఎల్‌ఓలు చేస్తున్న ఓటర్ రీ వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఈఓపీఆర్‌డీ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన



ఆత్మకూరు ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, సంఘం నాయకులు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆలిండియా ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఆత్మకూరు ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఆ శాఖ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలోట ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కుటుంబ పింఛన్ పెంపుదల, వేతన సవరణ వెంటనే చేపట్టడం, ఎల్‌ఐసీలోని ఖాళీల భర్తీ వెంటనే చేపట్టాలని ఇలా మొత్తం 23 సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి తెలిసేలా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు శివకుమార్, ఏఓ రవికుమార్, బ్రాంచ్ ఉద్యోగుల శ్యామ్ ప్రభాకర్, ఏవీ రమేష్, ప్రవీణ్, మన్సూర్, ఎల్‌ఐసీ ఏజెంట్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



సంగం: ఇంటింటి ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు నాగరాజు సూచించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓతో సమావేశం నిర్వహించారు. జీరో డోర్ నంబర్లు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఒక కుటుంబంలో పది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు అశోక్, ప్రవీణ్, ఆర్‌ఐ రాజ నారాయణ తదితరులు ఉన్నారు.